సాక్షి వికారాబాద్

ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025



భూ భారతితో రైతులకు..

భూ భారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతుందని కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. 10లో▸



ఉగ్రదాడి దుర్మార్గం

పహల్గాం ఉగ్రదాడి దుర్మార్గమైన చర్య అని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజు అన్నారు. 10లో▸




మళ్లీ జైలుకు రావొద్దు

క్షణికావేశంలో చేసే తప్పులకు కుటుంబం మొత్తం క్షోభిస్తుందని జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 10లో▸

కేసులు పెండింగ్‌లో ఉంచొద్దు

ఎస్పీ నారాయణరెడ్డి



అనంతగిరి: కేసులు పెండింగ్ లేకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. శనివారం వికారాబాద్‌లోని ఎస్పీ కార్యాలయంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల పురోగతి తదితర అంశాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా పీఎస్‌ల వారీగా నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి కేసును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. దొంగతనాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

వాహనాల విడిభాగాలకు వేలం

జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఆవరణలో డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన వాహనాల పాత టైర్లు, ట్యూబ్‌లు, బ్యాటరీలు, ఇతర విడి భాగాలకు బహిరంగ వేలం నిర్వహించారు.

















క్లుప్తంగా

రజతోత్సవ సభ విజయవంతం చేయాలి

బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు రహీస్‌అహ్మద్‌ఖాన్



పూడూరు: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కార్యకర్తలు, నాయకులు భారీగా తరలిరావాల బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు రహీస్‌అహ్మద్‌ఖాన్ పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఆదివారం వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో సభ జరగనుందని తెలిపారు. ఈ వేడుకలను విజయవంతం చేయాల్సిన బాధ్యత బీఆర్ఎస్ కుటుంబ సభ్యులపై ఉందన్నారు.

వరంగల్ సభకు ప్రత్యేక బస్సులు

ధారూరు మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



ధారూరు: బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం వరంగల్‌లోని ఎల్కతుర్తిలో జరుగున్న బహిరంగ సభకు మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు పట్లోళ్ల శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేరెల్లి, అల్లిపూర్, గట్టెపల్లి, కుక్కింద, నాగసమందర్, మున్నూరుసోమారం, మోమిన్‌కలాన్, తరిగోపుల, నాగారం, పీసీఎం తండా దోర్నాల్ గ్రామాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని వాటిని వినియోగించుకుని భారీ ఎత్తున తరలిరావాలన్నారు.

రజతోత్సవానికి తరలిరండి

కోట్‌పల్లి మండల అధ్యక్షుడు అనిల్



బంట్వారం: బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆ పార్టీ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్ శనివారం పిలుపునిచ్చారు. సభ విజయవంతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు.

29 గ్రామాల్లో బస్సులు

మర్పల్లి మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి

మర్పల్లి: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఆదివారం భారీ ఎత్తున పార్టీ శ్రేణులు తరలిరావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వరంగల్‌లో నిర్వహించే సభకు మండల పరిధిలోని 29 పంచాయతీల్లో బస్‌లు ఏర్పాటు చేశామని కేసీఆర్ అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున కదిలిరావాలని కోరారు. ఈ సమావేశంలో మర్పల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మధుకర్, మాజీ ఎంపీపీ రమేష్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు అశోక్, రాచన్న, రమేష్ మిత్ర, మర్పల్లి టౌన్ ప్రెసిడెంట్ గఫార్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గౌస్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, దామస్తాపూర్ మాజీ సర్పంచ్ జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారత్ సమ్మిట్‌లో పరిగి ఎమ్మెల్యే

పరిగి: నగరంలోని హైటెక్‌సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారత్ సమ్మిట్ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. 150 దేశాల 400 మంది ప్రతినిధులతో జరుగుతున్న భారత్ సమ్మిట్‌లో శనివారం ఎకనామిక్ జస్టిస్ ఇన్ అన్‌సర్టెయిన్ టైమ్స్ అనే అంశంపై ఎమ్మెల్యే వక్తగా మాట్లాడారు. అనంతరం వివిధ దేశాలతో ఒప్పందాలు, సత్సంబంధాలపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను మంత్రులతో కలిసి వీక్షించారు.

మే 20న దేశవ్యాప్త సమ్మె

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పరిగి: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని మే 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన పట్టణ కేంద్రంలో పార్టీ శ్రేణులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు భారీగా జన సమీకరణ

- ఒక్కో నియోజకవర్గం నుంచి 60 బస్సులు, వందకు పైగా కార్లు
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు



వికారాబాద్: ప్రత్యేక తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా పురుడు పోసుకున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు సిద్ధమైంది.. కేసీఆర్ సారథ్యంలో ప్రత్యేక రాష్ట్రం కోసం 15 ఏళ్ల పాటు సుదీర్ఘ పోరాటం జరిగింది. తెలంగాణ మలిదశ ఉద్యమంలో మన జిల్లాలో కూడా అనేక చారిత్రక ఘట్టాలు చోటు చేసుకున్నాయి. రాజకీయ, విద్యార్థి జేఏసీ నాయకులు కీలకంగా వ్యవహరించారు. కెరవెళ్లి వద్ద ఆర్టీసీ బస్సును దహనం చేయడం, వికారాబాద్ సమీపంలో ప్రముఖ హీరోల షూటింగ్‌లను అడ్డుకోవడం, షూటింగ్ సెట్లను తగులబెట్టడం వంటివి జరిగాయి. పరిగిలో చంద్రబాబుపై జరిగిన రాళ్ల దాడి దేశ వ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యింది. జిల్లా ర్యాలీలు, రాస్తారోకో, రైల్ రోకోతో దద్దరిల్లిపోయింది. నిరసన కార్యక్రమాలు, దీక్షలు ఏళ్ల పాటు సాగాయి. ఎన్నో పోరాటాల ఫలితంగా ప్రత్యేక రాష్ట్రం సిద్ధించింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు సిద్ధమైంది..

20 వేల మంది తరలింపునకు ఏర్పాట్లు

వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు జిల్లా నుంచి భారీ జన సమీకరణ చేస్తున్నారు. 20 వేల మంది కార్యకర్తలను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటలకు బస్సులు, కార్లు బయలుదేరనున్నాయి. ఒక్కో నియోజకవర్గం నుంచి 60 బస్సులు. వంద నుంచి 150 కార్లలో కార్యకర్తలు వెళ్లనున్నారు. నియోజకవర్గానికి ఐదు వేల మంది చొప్పున తరలించాలని నిర్ణయించారు. పరిగి నియోజకవర్గ ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పర్యవేక్షిస్తుండగా.. వికారాబాద్ నుంచి పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, తాండూరు నుంచి మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. కొడంగల్ నియోజకర్గ బాధ్యతలు పట్నం నరేందర్‌రెడ్డి తీసుకున్నారు.

మళ్లీ జైలుకు రావొద్దు

ఖైదీలకు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి సూచన



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

పరిగి: క్షణికావేశంలో చేసే తప్పులకు కుటుంబం మొత్తం క్షోభిస్తుందని జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం పరిగి సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్షణికావేశంలో తప్పులు చేసి జైలుకు వచ్చి ఉంటారని.. మళ్లీ అలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని సూచించారు. జైలు నుంచి బయటికి వెళ్లిన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఆర్థిక స్తోమత లేని పేద ఖైదీలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత సేవలు పొందవచ్చని తెలిపారు. అనంతరం పట్టణంలోని బాలసదనాన్ని సందర్శించి అనాథ పిల్లల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సబ్ జడ్జి వెంకటేశ్వర్లు, పరిగి న్యాయమూర్తి నాగుల శిల్ప, జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు రాము, వెంకటేష్, శ్రీనివాస్, గౌస్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

- రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి
- పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి

కుల్కచర్ల: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శివరాం నాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని అడవివెంకటాపూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులు దళారుల వద్ద మోసపోకుండా ప్రభుత్వమే మద్దతు ధరను అందిస్తూ వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీను, చత్ర్యానాయక్, పాండు, వాల్యానాయక్, చంద్య, సర్యానాయక్, గోపాల్, వెంకట్, బాలు నాయక్, తుకారాం, చుక్కయ్య, రవి నాయక్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రైతు పక్షపాతి

బొంరాస్‌పేట: వరి రైతులకు సన్నబియ్యం సాగు, బోనస్ వంటివి కల్పిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతిగా నిలిచారని పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని బురాన్‌పూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, రైతులకు కొనుగోళ్లలో ఇబ్బందు రానివొద్దని సూచించారు. రైతులు తేమశాతం పరిశీలించుకొని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, డైరెక్టర్ కృష్ణ, మాజీ సర్పంచ్ నర్సింలు తదితరులున్నారు.

మోదీపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి

కుల్కచర్ల: ప్రధాని మోదీపై అనుచిత వాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సౌమ్యారెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గాదె మైపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు కుల్కచర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం పార్టీ శ్రేణులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ సోషల్ మీడియా పూడూరు మండల శాఖకు చెందిన పత్తి మల్లేశం ప్రధాని మోదీపై అనుచిత వాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేశారని బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కుల్కచర్ల మండల అధ్యక్షుడు వెంకటయ్య, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి హన్మంతు, బోయిని భీమయ్య, మహేశ్ నాయక్, చలివేంద్రం మహేశ్, కొండ ఆంజనేయులు, రామయ్య, బిచ్చన్న, మల్లేశ్, మొగులయ్య, రాజు, ధర్మానాయక్, ప్రభు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని శిక్షించాలి

పూడూరు: ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని బీజేపీ శ్రేణులు శనివారం చన్గోముల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని మేడిపల్లికలాన్‌కు చెందిన పత్తి మల్లేశ్ సోషల్ మీడియా వేదికగా ప్రధాని మోదీ ఉగ్రదాడి చేయించారనడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, జిల్లా నాయకులు వెంకటయ్య, అనిల్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి

అనంతగిరి: భారత ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సదరు వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని శనివారం బీజేపీ నాయకులు వికారాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రమూకల దుశ్చర్య నేపథ్యంలో దేశంలో అన్ని ప్రాంతాల్లో నివాళులు అర్పిస్తున్న సందర్భాల్లో పూడూర్ మండలానికి చెందిన పత్తి మల్లేశం సోషల్ మీడియా వేదికగా ఒక వీడియో చేసి దేశ ప్రధాని మోడిని తీవ్రంగా విమర్శిస్తూ వ్యంగ్యంగా మాట్లాడుతూ మోదీయే హిందువులపై దాడి చేయించారంటూ ఆరోపిస్తూ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. సదరు వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మండల అధ్యక్షుడు శివరాజుగౌడ్, నాయకులు సదానందరెడ్డి, అమరేందర్‌రెడ్డి, బస్వలింగం, శ్రీదేవి, శివరాజు, లక్ష్మి, జగన్నాథ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

పూడూరు: ప్రభుత్వం ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగాలని పూడూరు తహసీల్దార్ భరత్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో మహిళా సమాఖ్య మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘాలను సక్రమంగా నడిపితే ప్రభుత్వం బ్యాంకులు తక్కువ వడ్డీకే రుణాలను ఇస్తుందని అన్నారు. ఈ సందర్భంగా నూతన మండల మహిళా సమాఖ్య కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా బేబి, కార్యదర్శులుగా జయమ్మ, ఆండాలును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం వీరయ్య, ఏపీఎం బందయ్య, వీఓలు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

ఉచిత కరాటే శిక్షణ తరగతులు ప్రారంభం

అనంతగిరి: కరాటేతో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని మేరినాట్స్ స్కూల్ గ్రౌండ్‌లో మాస్టర్ జపాన్ షోటోకాన్, పీఎంఏ జపాన్ షోటోకాన్ కరాటే అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత సమ్మర్ క్యాంపును రమేశ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మే చివరి వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ హఫీజ్, కాంగ్రెస్ నాయకుడు వెంకట్‌రెడ్డి, నిర్వాహకులు కరాటే మాస్టర్ విజయ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో బాలికలకు..

తాండూరు టౌన్: హిందూ ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో బాలికలకు ఉచిత కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు పరిషత్ కన్వీనర్ గాజుల బస్వరాజ్ అన్నారు. హనుమాన్ చాలీసా, భగవద్గీత శ్లోకాల పఠనంలోనూ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈమేరకు ప్రైవేటు పాఠశాలల సంఘం సభ్యులతో కలిసి శనివారం తాండూరులో పోస్టర్ ఆవిష్కరించారు. మే 1 నుంచి స్థానిక భాష్యం జూనియర్ కళాశాలలో ఆరేళ్ల నుంచి 16 ఏళ్ల వయసు గల బాలికలకు ఉదయం కరాటే శిక్షణ ఉంటుందన్నారు. యశోధనగర్‌లోని నేతాజీ పాఠశాలలో హనుమాన్ చాలీసా, భగవద్గీత శ్లోకాల పఠనంలో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు 9030056755, 6300383211 నంబర్లలో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతాజీ పాఠశాల ప్రతినిధులు రవీందర్ రెడ్డి, మణిమాల, అభిలాష్ రెడ్డి, అనురాధ. పరిషత్ ట్రస్టీలు వేణుగోపాల్ రెడ్డి, ఓంప్రకాష్ సోమాని, పటేల్ విజయ్, రమేష్, ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ప్రతినిధులు కీర్తిశర్మ, మోహన్ గౌడ్, శివ, సతీష్ పాల్గొన్నారు.

రేపు 108లో ఇంటర్వ్యూలు

అనంతగిరి: ఈఎంఆర్ఐ 108లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం సోమవారం వికారాబాద్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా 108 సేవల ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, ఒక సెట్ జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, ఏఎన్ఎం, ఎంపీహెచ్ఏ. జీఎన్ఎం, బీఎస్సీ(బీజడ్‌సీ) చేసిన వారు అర్హులన్నారు. పట్టణంలోని మిషన్ ఆస్పత్రి ఆవరణలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. మరిన్ని వివరాల కోసం సెల్ నంబర్ 9154041953, 9703958721లలో సంప్రదించాలని సూచించారు.

ధాన్యం సేకరణ సజావుగా సాగాలి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్




దౌల్తాబాద్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

దౌల్తాబాద్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పీఏసీఎస్ సిబ్బందికి సూచించారు. శనివారం దౌల్తాబాద్, యాంకి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద రైతులతో మాట్లాడారు. ఇప్పటి వరకు ఎంత మేర ధాన్యం సేకరించారని ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గాయత్రి, పీఏసీఎస్ సీఈఓ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ - ఏలోకి మార్చాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్



మాట్లాడుతున్న జగన్‌మోహన్

దౌల్తాబాద్: ముదిరాజ్‌లను బీసీ – డీ నుంచి బీసీ – ఏలోకి మార్చాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని చెన్నకేశవ ఫంక్షన్ హాల్‌లో మండల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ డిమాండ్‌ను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లకు అత్యధిక స్థానాలు కేటాయించేలా ఆయా పార్టీలను కోరారు. ప్రతి నియోజకవర్గంలో ముదిరాజ్‌లకు హాస్టల్, కమ్యూనిటీ భవనాలు నిర్మించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కూర వెంకటయ్య, హన్మంతు, రెడ్డి శ్రీనివాస్, వెంకట్రాములు, అడ్వకేట్ వెంకటయ్య, నర్సప్ప, నర్సింలు, ఆశప్ప, కృష్ణ, మహిపాల్, మల్కరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల పొలాలను పరిశీలించిన అడ్వకేట్ కమిషన్

దోమ: మండలంలోని ఐనాపూర్‌కు చెందిన ఇద్దరి రైతుల పొలాలను శనివారం పరిగి కోర్టు అడ్వకేట్ కమిషన్ ఆనంద్ గౌడ్ పరిశీలించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఇద్దరి రైతులకు పక్కపక్కనే పొలాలు ఉన్నాయి. వీరికి హద్దు సమస్య ఉంది. సర్వే చేసి సమస్యను పరిష్కరించాలని ఇరువురూ కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో కోర్టు అడ్వకేట్ కమిషన్ ఆనంద్ గౌడ్‌ను నియమించింది. ఆయన ఇద్దరి రైతుల తరఫున ఇద్దరు సీనియర్ అడ్వకేట్లు బి.వెంకట్ రెడ్డి, గౌస్‌పాషాతో పొలాలను పరిశీలించారు. ఎవరూ ఆందోళన చెందరాదని ఇద్దరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

భూ భారతితో రైతులకు మేలు

- జిల్లా స్థాయిలోనే భూ సమస్యలు పరిష్కరించుకునే అవకాశం
- ధరణి కంటే వెయ్యి రెట్ల మెరుగైన పథకం
- కలెక్టర్ ప్రతీక్ జైన్



దౌల్తాబాద్: మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

దుద్యాల్: భూ భారతి చట్టంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, అన్ని రకాల భూ సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శనివారం దుద్యాల్‌లో కొత్త చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధరణి చట్టంలో భూ సమస్యలకు పరిష్కారం లభించేది కాదన్నారు. రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు.. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన భూ భారతి చట్టం ధరణి కంటే వెయ్యి రెట్ల మెరుగైన పథకమని పేర్కొన్నారు. జిల్లాలో భూ సమస్యల పరిష్కారం కోసం దాదాపు 15 వేల దరఖాస్తులు వచ్చాయని.. వాటిని 5 వేలకు తెచ్చామని వివరించారు. మిగిలిన వాటిని కూడా త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలను మండల, డివిజన్, జిల్లా స్థాయిలో పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. కోర్టు పరిధిలోని సమస్యలను మినహా మిగతా అన్నింటినీ పరిష్కరించుకోవచ్చని తెలిపారు. జూన్ 2 నుంచి కొత్త చట్టం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందన్నారు. అనంతరం దుద్యాల్‌లో నిర్మాణ దశలో ఉన్న మండల సమీకృత భవనాలను కలెక్టర్ పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో పంచాయత్ రాజ్ డీఈ సుదర్శన్ రావ్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడి, తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ మహేశ్‌కుమార్, డీటీ వీరేశ్‌బాబు, ఆర్ఐ నవీన్, వ్యవసాయ శాఖ మండల అధికారి నాగరాజు, ఎంపీఓ సత్యనారాయణ, ఏఈవోలు రేణుక, జ్యోతి, మాణికేశ్వరి, భావన, కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్, జిలా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు ఖలీల్ పాషా, శ్రీనివాస్ రెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవినాయక్, నాయకులు ఖాజా, శ్రీశైలంగౌడ్, కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ రద్దు చేయండి

ఏళ్ల క్రితం నిర్మించుకున్న ఇళ్ల భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని మండల పరిధిలోని ఆలేడ్ గ్రామస్తులు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన భూ భారతి అవగాహన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ మేరకు గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన నర్సింహారెడ్డికి సంబంధించిన 377 సర్వే నంబర్‌లోని 22 గుంటల భూమిలో ఇళ్లు, పశువుల షెడ్లు, బొందల గడ్డకు దారి ఉంది. గ్రామానికి చెందిన దత్తురెడ్డికి సంబంధించిన 378 సర్వే నంబర్‌లో 12 ఎకరాల భూమిలో పూర్వం నుంచి ఇళ్లు, పశువుల షెడ్లు, పాఠశాల భవనం ఉంది. ఈ భూమిని నర్సింహారెడ్డి, దత్తురెడ్డి పూర్వీకులు గ్రామస్తులకు ధృవపత్రాలు ఇచ్చి అమ్మారు. ప్రస్తుతం వారి భూములను ఒకరి భూమి మరొకరు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి సిద్ధమయ్యారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న తాము నాలుగు రోజుల క్రితం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో రిజిస్ట్రేషన్ నిలిపివేశారని కలెక్టర్ వివరించారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ ప్రస్తుతం ఆరెండు సర్వే నంబర్ల భూముల రిజిస్ట్రేషన్ హోల్డ్‌లో ఉంచాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. గ్రామంలోని బొందల గడ్డకు వెళ్లే దారిలో సీసీ రోడ్డు వేయించాలని సూచించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో అనంతయ్య, నర్సింలు గౌడ్, నారాయణ గౌడ్, శ్రీధర్ గౌడ్, లక్ష్మీనారాయణ, ఆశప్ప, ఆంజనేయులు, ఆనంద్, రాజు, మల్లేశ్, అనిల్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, పాండు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మహేశ్, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం

దౌల్తాబాద్: సాదాబైనామాలపై కొనుగోలు చేసిన భూములకు భూ భారతితో పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శనివారం దౌల్తాబాద్‌లో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొత్త చట్టంతో భూ రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, ఆర్ఓఆర్, మార్పులు చేర్పులు, సాదాబైనామాల వంటి సేవలు సులభతరం అవుతాయన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. తహసీల్దార్ వద్ద సమస్య పరిష్కారం కాకుంటే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం నిర్మాణ దశలో ఉన్న గ్రంథాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దారు గాయత్రి, ఎంపీడీఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రదాడి దుర్మార్గం

ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజు



కొడంగల్‌రూరల్: నివాళి అర్పిస్తున్న ఆర్ఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు

కొడంగల్ రూరల్: పహల్గాం ఉగ్రదాడి దుర్మార్గమైన చర్య అని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం(ఆర్ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజు అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్ఎస్‌యూ కార్యాలయంలో విద్యార్థి సంఘం నాయకులతో కలిసి కొవ్వొత్తుల ప్రదర్శనతో మౌనం పాటిస్తూ మృతులకు నివాళి అర్పించారు. అనంతరం భీమరాజు మాట్లాడుతూ.. ప్రాణం విలువ తెలియని కిరాతక హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉగ్రమూకలను తుదముట్టించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యులు ఫయాజ్, భీమేశ్, అభిషేక్, వసంత, గంగోత్రి, కవిత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో..

అనంతగిరి: పహల్గాం ఉగ్రమూకల దాడిని తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం రాత్రి వికారాబాద్ పట్టణంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వర్షం కురుస్తున్నా వైద్యులు, మెడికోలు ర్యాలీ కొనసాగించి మృతులకు నివాళి అర్పించారు. ఉగ్రవాదులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి బాధాకరం

దౌల్తాబాద్: పహల్గాంలో ఉగ్రదాడి బాధాకరమని హిందూవాహిని చంద్రకల్ సభ్యులు విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం వారు గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు.

ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధం



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది, తండా వాసులు

దుద్యాల్: ప్రమాదవశాత్తు రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని సాగారం తండాలో శనివారం చోటు చేసుకుంది. తండాకు చెందిన కిష్యా నాయక్‌కు తన పశువులకు మేత కోసం గడ్డిని కొనుగోలు చేసి పొలం వద్ద వాములు ఏర్పాటు చేసుకున్నాడు. శనివారం ఆయన గడ్డివాములు దగ్ధమవుతున్నట్లు సమాచారం అందుకుని కొడంగల్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చాడు. ఫైర్‌ఇంజన్ మంటలార్పే సమయానికే 90 శాతం గడ్డి కాలిబూడిదయింది. రూ.20వేల నష్టం వాటిల్లిందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో చిన్నారులు

దుద్యాల్: లగచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అరుణ, శ్రీలత, దుద్యాల్, ఈర్లపల్లి గ్రామాలకు చెందిన అంగన్వాడీ టీచర్లు నవనీత, పద్మలత, ఎల్లమ్మ, యాదమ్మ, రేహన, వెంకటమ్మ, సునీత, అరుణ తల్లితండ్రులు పాల్గొన్నారు.

దస్తయ్య కుటుంబానికి అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దోమ: ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న దస్తయ్య మృతి చెందాడు. ఈ మేరకు విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి శనివారం లింగన్‌పల్లిలో దస్తయ్య భౌతికకాయానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి, దోమ మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు గోపాల్‌గౌడ్, ఆంజనేయులు, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు సలీం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌కుమార్, బీఆర్ఎస్ పరిగి మండల మాజీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

దోమ: పేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా ఉటుందని మాజీ సర్పంచ్ లక్ష్మయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని రాకొండలో చాలప మహేశ్వరి అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. ఇదే విషయాన్ని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.76వేల చెక్కును మంజూరు చేయించారు. ఈ మేరకు శనివారం మాజీ సర్పంచ్ లక్ష్మయ్య బాధితురాలికి మంజూరైన చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్, అంజిలయ్య, ఖజామియా, చంద్రయ్య, రాజు, ఇమ్రాన్, వెంకటయ్య, బందెయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు మైన్ ఎన్ యువర్స్ వెడ్డింగ్ జ్యువెలరీ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- కేపీహెచ్‌బీ కాలనీలో లులు మాల్‌లో లులు బిగ్ చాకో డేస్ ఫెస్టివల్ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు కోకో మిలన్ యాక్టివిటీస్, చిన్నారులకు పెయింటింగ్, డ్రాయింగ్, త్రీడీ యానిమేషన్ చిత్రాలు, వీడియోలతో ఇంగ్లిష్ పద్యాలు, పాటలపై శిక్షణ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- ప్రపంచ నృత్య దినోత్సవం సందర్భంగా బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు స్ఫూర్తి మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ, అల్ ది బెస్ట్ అకాడమీ సంయుక్తాధ్వర్యంలో స్ఫూర్తి నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో ఫుడ్ ఇండియా ఎక్స్‌-2025 ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో క్విస్ట్ లైట్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని బీఆర్‌ఎస్ భవన్ సమీపంలో ఉన్న కళింగ కల్చరల్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

శ్రీకృష్ణ దేవరాయ పాత్రలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.కాశీం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ 108వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రదర్శించిన అష్టదిగ్గజాలు నాటకంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం శ్రీ కృష్ణదేవరాయులుగా నటించారు. నిత్యం అభ్యుదయ, విప్లవ భావాల ప్రసంగాలతో ప్రజలను ఆలోచింపజేసే ప్రొ.కాశీం ఒక్కసారిగా నాటక ప్రదర్శనలో ప్రత్యక్షమవడంతో విద్యార్థులు, అధ్యాపకులు ఆశ్చర్యానికి గురయ్యారు.

నల్సార్ యూనివర్సిటీతో ఒప్పందం

హిమాయత్‌నగర్: నల్సార్ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, ఆర్.వి.ఆర్. అసోసియేట్స్, ఐపీఆర్ అడ్వకేట్స్ హైదరాబాద్ మధ్య అవగాహనా ఒప్పందం జరిగింది. ప్రపంచ మేధోసంపత్తి హక్కుల దినోత్సవం సందర్భంగా, నల్సార్ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొ.కృష్ణదేవరావు, ఆర్.వి.ఆర్ అసోసియేట్స్, ఐపీఆర్ అడ్వొకేట్, ప్రతినిధి మేఘం మల్లిఖార్జునరెడ్డి ఎంఓయూ మీద సంతకాలు చేశారు. ఈ నేపథ్యంలో నల్సార్ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఐపీఆర్(మేధోసంపత్తి హక్కు) ప్రత్యేక సబ్జెక్టుగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి దొంతిరెడ్డి నరసింహారెడ్డి జ్ఞాపకార్థం ఆర్.వి.ఆర్ అసోసియేట్స్, ఐపీఆర్ న్యాయవాదులు గోల్డ్‌మెడల్ అందజేశారు. కార్యక్రమంలో ప్రొ.అనింద్య సర్కార్, సుబోధ్ కుమార్, ఆర్.వి.ఆర్ అసోసియేట్స్ న్యాయవాదులు పి.వి.వి.గోపాల కృష్ణమూర్తి, అనంత కేశవన్, రిషిత పాండే, అక్షత్ శర్మ, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గోల్కొండ: ఆమెజాన్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గోల్కొండ మోతీదర్వాజాకు చెందిన మహ్మద్ ఇబ్రహీం(36) కొంత కాలంగా ఆమెజాన్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం ఇబ్రహీం ఇంట్లోనే నిద్రపోయాడు. అయితే మహ్మద్ ఇబ్రహీంకు భార్యపై గత కొన్ని రోజులుగా అనుమానం ఉంది. కొద్ది రోజుల క్రితం భార్యపిల్లలను పుట్టింటికి పంపించాడు. కాగా ఇబ్రహీం గదిలోంచి ఎంతకు బయటకు రాకపోవడంతో స్థానికులకు అనుమానం వచ్చి తలుపు తీసి చూడగా ఇబ్రహీం సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించాడు.పోలీసులు వచ్చి పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

అక్రమంగా ఆరువేల మంది!

బాలాపూర్‌లో రోహింగ్యాల తిష్ట

- అడ్డదారుల్లో భారత గుర్తింపు కార్డులు పొందుతున్న వైనం
- వీరిని కూడా వెనక్కి పంపాలని డిమాండ్



భారత పౌరసత్వ కార్డులు పొందిన రోహింగ్యాలు



జూలైలో బిక్కుబిక్కుమంటూ వచ్చిన రోహింగ్యాలు(ఫైల్)

పహాడీషరీఫ్: పాకిస్తాన్ పౌరులను ఆ దేశానికి తిరిగి పంపాలని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో అందరి దృష్టి మయన్మార్(బర్మా) దేశానికి చెందిన రోహింగ్యా ముస్లింలపై పడింది. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్ర దాడుల నేపథ్యంలో పాక్ అక్రమ వలసదారులపై భారత్ అప్రమత్తమైంది. దిక్కుతోచని స్థితిలో రోహింగ్యాల శరణార్థుల ముసుగేసుకుని నగర శివారులోని బాలాపూర్, పహాడీషరీఫ్, జల్‌పల్లి, కంచన్‌బాగ్, మైలార్‌దేవ్‌పల్లి తదితర ప్రాంతాలకు పలువురు వచ్చిచేరారు. కాలక్రమేణా వేలాదిగా అక్రమమార్గంలో వచ్చి స్థిరపడ్డారు. కొందరు ఏకంగా భారత పౌరసత్వ కార్డులు కూడా పొందారు. బాలాపూర్ రాయల్ కాలనీలోని వీరి క్యాంప్‌లో తలదాచుకున్న ఓ ఉగ్రవాదిని సైతం గతంలో ఎన్‌ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. దేశ భద్రతకు ముప్పువాటిల్లే పరిస్థితి ఉన్న నేపథ్యాన్ని వివరిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి, బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌కు రోహింగ్యాల విషయమై వినతిపత్రాలు అందజేశారు.

బాలాపూర్‌లో 6 వేల మంది

2012 జూలైలో బర్మా దేశంలో జరిగిన అల్లర్ల కారణంగా మొదట 210 మంది బాలాపూర్ రాయల్ కాలనీ, హఫీజ్‌బాబా నగర్‌కు వచ్చి తలదాచుకున్నారు. ఈ సమయంలోనే యూఎన్‌హెచ్‌సీఆర్(యునైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రిఫ్యూజెస్) శరణార్థులుగా కార్డులు కూడా పొందారు. కాలక్రమేణా మరికొంత మంది రావడంతో వీరి సంఖ్య ఇప్పుడు గణనీయంగా పెరిగింది. పోలీసుల రికార్డుల ప్రకారం ప్రకారం బాలాపూర్ పరిధిలోని 27 క్యాంప్‌లలో సుమారు ఆరు వేల మంది వరకు నివాసం ఉంటున్నారు. వీరికి సంబంధించిన అన్నిరకాల నమూనాలను పోలీసులు ఇదివరకే సేకరించారు.

ఇక్కడి పరిస్థితులపై పట్టు సాధించి..

బాలాపూర్ పరిసరాల్లో నివాసముంటున్న శరణార్థులు స్థానికంగా ఉన్న కొందరిని మచ్చిక చేసుకుని ఏకంగా భారత గుర్తింపు కార్డులు పొందుతుండటం గమనార్హం. ఓటర్ గుర్తింపు కార్డు మొదలుకుని ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ కూడా పొందుతున్నారు. జమ్మూ, కశ్మీర్, ఉత్తరప్రదేశ్ ప్రాంతాల్లోనే ఎక్కువ శాతం మంది కార్డులు పొందుతుండగా.. స్థానిక దళారుల సహకారంతో కొంత మంది రోహింగ్యాలు ఇక్కడ గుర్తింపు కార్డులు పొందుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.



ఆధార్ కార్డు పొంది 2018 మార్చి 17న అరెస్టైన ముగ్గురు రోహింగ్యాలు

తరచూ న్యూసెన్స్

- 2018 మార్చి 17న అక్రమంగా ఆధార్ కార్డులు పొందిన రోహింగ్యాలైన మహ్మద్ హసన్(23), మహ్మద్ ఆరిఫ్(18), మహ్మద్ సైఫుల్ ఇస్లాం(18)లను బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరు మహ్మద్ హసన్ అఫ్సర్ అనే వ్యక్తి సాయంతో బహదూర్‌పురా చిరునామాపై ఆధార్ కార్డులు పొందారు.
- 2017 సెప్టెంబర్ 12న ఆధార్ కార్డు సహాయంతో పాస్ పోర్టు తీసుకునేందుకు యత్నించిన మహ్మద్ ఇస్మాయిల్ అనే బర్మా దేశస్తుడిని పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు.
- 2016- 17 సంవత్సరంలో బాలాపూర్, పహాడీషరీఫ్ పోలీసులు అక్రమంగా కార్డులు పొందిన 25 మంది రోహింగ్యాలను అరెస్ట్ చేశారు.
- 2017 సెప్టెంబర్ 16న తమ దేశానికి చెందిన యువకుడికి యూఎన్‌హెచ్‌సీఆర్ కార్డు ఇప్పిస్తానంటూ రూ.10 వేలు తీసుకొని మోసానికి పాల్పడిన బర్మా దేశస్తుడిని కంచన్‌బాగ్ పోలీసులు అరెస్ట్ చేశారు.
- 2014 అక్టోబర్ 9న మహ్మద్ హుస్సేన్(20) మైనర్‌ను వివాహం చేసుకునే క్రమంలో తలెత్తిన వివాదంతో రెచ్చిపోయిన రోహింగ్యాలు పోలీసులు, స్థానిక బస్తీ వాసులపై రాళ్ల దాడికి తెగబడ్డారు. ఈ సమయంలో బస్తీ వాసులు, రోహింగ్యాల నడుమ పెద్ద గొడవే జరిగింది.
- 2014 నవంబర్‌లో శరణార్థుల ముసుగులో ఉన్న ఖాలేద్ మహ్మద్ అనే వ్యక్తిని ఉగ్రవాద సంబంధాల అనుమానంతో రాయల్ కాలనీ నుంచి ఎన్‌ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు.

వైద్యుల సమస్యలను పరిష్కరించాలి



2వ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న తెలంగాణ ప్రభుత్వ వైద్యులు

సుల్తాన్‌బజార్: రాష్ట్రంలోని వైద్యుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నరహరి, డాక్టర్ లాలుప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ ఎంకే రావూఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్ గెస్ట్‌హౌస్‌లో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం 2వ జనరల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల వైద్యులు పాల్గొన్నారు. ముందుగా ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన వారికి నివాళులర్పించి రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న టెరిఫెరల్ మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న వైద్యులకు అలవెన్సులు మంజూరు చేయాలని కోరారు. వైద్య విధాన పరిషత్‌ను డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీస్‌గా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లను ఉస్మానియా, గాంధీ కేఎంసీ నిజామాబాద్‌కు బదిలీ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న సివిల్ సర్జన్, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, ఇతర ప్రమోషన్లను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికిగాను ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కార్యాచరణ రూపొందించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజు, డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ దీన్‌దయాల్, డాక్టర్ రమేష్, కామారెడ్డి శ్రీనివాస్, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

జూలై లోపు పూర్తిస్థాయి 4 జీ సేవలు

బీఎస్‌ఎన్‌ఎల్ సౌత్ డీజీఎం దినేష్



కస్టమర్ సర్వీస్ క్యాంప్‌లో పాల్గొన్న బీఎస్‌ఎన్‌ఎల్ సౌత్ డీజీఎం దినేష్, అధికారులు, సిబ్బంది

చార్మినార్: జూలై నెల లోపు పూర్తిస్థాయిలో 4 జీ సేవలు అందుబాటులోకి వస్తాయని బీఎస్‌ఎన్‌ఎల్ సౌత్ డీజీఎం ఈ.దినేష్ తెలిపారు. బీఎస్‌ఎన్‌ఎల్ చాంద్రాయణగుట్ట కస్టమర్ సర్వీస్ సెంటర్ ఎదురుగా శనివారం సర్వీస్ క్యాంప్ జరిగింది. ఈ సందర్భంగా వినియోగదారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఉత్తమ సేవలను అందించడంలో బీఎస్‌ఎన్‌ఎల్ ముందుందని వివరించారు. బీఎస్‌ఎన్‌ఎల్ సేవల వినియోగంలో ఏవైనా సమస్యలు ఎదురవుతున్నాయా..అనే విషయాలను ఆరా తీశారు. కొన్ని సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు వెంటనే స్పందించారు. కస్టమర్లు అధిక సంఖ్యలో వచ్చి తమ సమస్యలతోపాటు పలు సూచనలు, సలహాలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 జీ సేవలను పూర్తి స్థాయిలో అందించనున్నామని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంతో పెరిగిన ఈ రోజుల్లో సైబర్ నేరాలు సైతం అంతే వేగంగా పెరిగాయని, బీఎస్‌ఎన్‌ఎల్ సేవలను వినియోగించుకోవడంతో సైబర్ నేరాల బారిన పడకుండా ఉంటామన్నారు. బకాయిలను వన్‌టైం సెటిల్‌మెంట్ కింద వసూలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏజీఎంలు ఎంఆర్‌వీ శాస్త్రీ, రాములు, ఎంటీ రాంజీలతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్య పారిశ్రామిక సంఘాలు ఏర్పాటు చేయాలి

తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు చొప్పరి శంకర్



వినతి పత్రం అందజేస్తున్న చొప్పరి శంకర్ ముదిరాజ్

హిమాయత్‌నగర్: ముదిరాజ్‌లతో మత్స్య పారిశ్రామిక సంఘాలు నూతనంగా ఏర్పాటు చేసి అన్ని సంఘాలలో ముదిరాజ్‌లకు పాత, కొత్త సభ్యత్వాలు కల్పించాలని, జీఓ నెం.6 అమలు చేయాలని మత్స్య శాఖ అడిషనల్ డైరెక్టర్ మురళీకృష్ణకు శనివారం తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మద్దెల సంతోష్ ముదిరాజ్‌తో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు మత్స్య కారుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎక్స్‌పర్ట్ కమిటీకి ముదిరాజ్‌లు ఎలా మత్స్యకారులనే విషయాన్ని చారిత్రక ఆధారాలతో వివరంగా తెలిపినట్లు పేర్కొన్నారు. శనివారం హైదర్‌గూడలోని మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి ఏపీలో 1964 నాటి జీఓ నెం.98 ద్వారా ముదిరాజ్ కులంతో సహా 29 సామాజిక సమూహాలను అధికారికంగా మత్స్యకార సంఘాలుగా గుర్తించిందని పేర్కొన్నారు. తెలంగాణలోని ముదిరాజ్, బెస్త, ముత్తరాసి, తెనుగొల్లు వర్గాల చేపల వేట హక్కులను ధ్రువీకరిస్తూ ఒక వివరణ జారీ చేయాలని నిపుణుల కమిటీని కోరారు. వంద ఏళ్లకుపైగా పూర్వీకులు చేసినట్లుగానే ఈ హక్కులను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్ సంఘం సభ్యులు ప్రధానంగా చేపలు పట్టడంలో నిమగ్నమై తెలంగాణ అంతటా 3,400 కంటే ఎక్కువ మత్స్యకార సహకార సంఘాల మద్దతుతో వృత్తిని కొనసాగిస్తూ వేలాది కుటుంబాల జీవనోపాధి అవసరాలను తీరుస్తున్నారని తెలిపారు.

నైపుణ్యం పెరిగితేనే మెరుగైన సేవలు

తెలంగాణ ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా



సాక్షి, సిటీబ్యూరో: వైద్యుల్లో స్కిల్ పెరిగితేనే ప్రజలకు మంచి చికిత్సలు అందించే వీలుంటుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా అన్నారు. శనివారం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో స్కల్ బేస్ ఎండోస్కోపి సమ్మిట్‌-25 రెండు రోజుల ఇంటర్నేషనల్ సమ్మిట్, లైవ్ వర్క్‌షాప్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రెయిన్ ట్యూమర్ సర్జరీల కోసం అత్యాధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. న్యూరో ఎండోస్కోపీ స్కల్ బేస్ సర్జరీతో ఖచ్చితమైన లక్ష్యాలను సమర్థవంతంగా పూర్తిచేయవచ్చని పేర్కొన్నారు. యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ పవన్ మాట్లాడుతూ బ్రెయిన్ ట్యూమర్ సర్జరీల కోసం రోబోటిక్ న్యూరో సర్జరీ, న్యూరో ఎండోస్కోపీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మెదడులో గడ్డలు, మూర్ఛ వ్యాధి చికిత్సల్లో అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తుందని తెలిపారు. యశోద ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ లింగయ్య మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీని అందరికీ అందించాలనే లక్ష్యంతో యశోద ఆసుపత్రి ఏటా షేరింగ్ నాలెడ్జ్ ప్రోగ్రాంలను నిర్వహిస్తోందన్నారు. ఫోకస్ బేస్ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్కల్ బేస్ ఎండోస్కోపీ ట్రీట్‌మెంట్ ఖచ్చితమైన లక్ష్యాలను చేరుకుంటుందన్నారు. చికిత్స చేసినపుడు పక్కనున్న అవయువానికి హానికలగకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ చికిత్స ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సుమారు 500 మంది వైద్యులు పాల్గొన్నారు.

లులు మాల్‌లో చాక్లెట్ ఫెస్టివల్ ప్రారంభం



కేపీహెచ్‌బీకాలనీలోని లులు మాల్‌లో చాక్లెట్ ఫెస్టివల్ ను ప్రారంభిస్తున్న బాల నటుడు మాస్టర్ రేవంత్

మూసాపేట: కేపీహెచ్‌బీకాలనీలోని లులుమాల్‌లో చాక్లెట్ ఫెస్టివల్ నడుస్తోంది. లులు బిగ్ చాకో డేస్ ఫెస్టివల్‌ను శుక్రవారం రాత్రి బాల నటుడు(సంక్రాంతికి వస్తున్నాం ఫేం) మాస్టర్ రేవంత్ ప్రారంభించారు. ఈ నెల 27 వరకు కోకో మిలన్ యాక్టివిటీస్ ఉంటాయని, చిన్నారులకు పెయింటింగ్, డ్రాయింగ్, త్రీడీ యానిమేషన్ చిత్రాలు, వీడియోలతో ఇంగ్లిష్ పద్యాలు, పాటలు నేర్పిస్తామని రీజినల్ మేనేజర్ మహ్మద్ షరీఫ్ తెలిపారు. లులు బిగ్ చాకో డేస్‌లో రూ.200 నుంచి ఐ ప్యాడ్ గెలుచుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ విమేశ్, లులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

300 గుడిసెలు బుగ్గి

- అగ్నికి ఆహుతైన పేదల గూళ్లు
- కట్టుబట్టలతో పరుగులు తీసిన బాధితులు
- మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బంది
- సంఘటనా స్థలాన్ని సందర్శించిన అధికారులు, నాయకులు



గుడిసెలు కాలిపోయి మిగిలిన బూడిద

హయత్‌నగర్: రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరులోని వివాదాస్పద స్థలంలోని గుడిసెల్లో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు 300పైగా గుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలు ఎగిసి పడుతూ క్రమంగా విస్తరించడంతో బాధితులు సర్వం వదిలేసి బయటికి పరుగులు తీశారు. దూరంగా గుడిసెలు ఉన్న కొందరు సామగ్రిని కాపాడుకోగలిగారు. పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, ఐదు అగ్ని మాపక వాహనాలతో మూడు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు.

ఎలా జరిగింది... ?

కుంట్లూరు సర్వేనంబర్ 214 నుంచి 224 వరకు సుమారు వంద ఎకరాల భూమిపై కొంత కాలంగా వివాదం సాగుతోంది. తమదేనని ప్రైవేటు వ్యక్తులు వాదిస్తుండగా, భూదాన్ భూమి అని సీపీఐ నాయకులు పేర్కొంటున్నారు. ఈ వివాదం కోర్టులో ఉండగా.. రెండేళ్ల క్రితం వేలాది మంది పేదలు ఇక్కడ గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వలస వచ్చిన పేదలు ఇక్కడ నివసిస్తూ నగరంలో ఉపాధి పొందుతున్నారు. కాగా కోర్టు వివాదంలో భూమిలోని గుడిసెల్లో అగ్ని ప్రమాదం జరగడం అనుమానాలకు తావిస్తోంది. వీటిని ఎవరైనా తగులబెట్టారా..? ప్రమాదవశాత్తు జరిగిందా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డీసీపీ ప్రవీణ్‌కుమార్, సీఐ నాగరాజుగౌడ్, ట్రాఫిక్ సీఐలు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

బాధితులను ఆదుకుంటాం..

గుడిసెలు తగులబడి, సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన నివేదిక, బాధితుల వివరాలను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

పట్టాలివ్వాలి..

సంఘటనా స్థలాన్ని సందర్శించిన సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితులను తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. పేదలకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

పిల్లల సర్టిఫికెట్లు కాలిపోయాయి



నేను ఫ్రూట్ మార్కెట్‌లో హమాలీ పని చేస్తా. భర్త మృతి చెందడంతో ముగురు ఆడ పిల్లలతో కలిసి గుడిసె వేసుకుని మూడేళ్లుగా ఇక్కడే ఉంటున్నా. రోజు లాగానే పనికి వెళ్లి వచ్చేసరికి గుడిసె బూడిదైంది. పిల్లల సర్టిఫికెట్లు కాలిపోయాయి.

– నాన్పు, బాధితురాలు

డబ్బులు, వస్తువులు తగలబడ్డాయి



గుడిసెలో నా కూతురుకు చెందిన 4 వేల నగదుతో పాటు దుస్తులు, వస్తువులు, వంట సామగ్రి కాలిపోయాయి. తినడానికి కూడా ఏమీ లేదు. ఈ పూటకు ఏమి తినాలో ఎక్కడ ఉండాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

– దేవమ్మ, బాధితురాలు

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



కమ్యూనిటీ సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న రాచకొండ సీపీ సుధీర్ బాబు

రాచకొండ సీపీ సుధీర్ బాబు

పహాడీషరీఫ్: నేరాలను నియంత్రించడంతో పాటు క్లిష్టమైన కేసులను ఛేదించడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు పేర్కొన్నారు. మహేశ్వరం జోన్ పరిధిలో దాతల సాయంతో రూ.65 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 855 కమ్యూనిటీ సీసీ కెమెరాలను శనివారం ఆయన బాలాపూర్‌లోని వైఏఆర్ కన్వెన్షనల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మహేశ్వరం డీసీపీ డి.సునీతా రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు భద్రత కల్పించడమే ధ్యేయమని అన్నారు. దేశంలో అత్యధికంగా సీసీ కెమెరాలు తెలంగాణలోనే ఉన్నాయని, రాష్ట్రంలో వర్టికల్ విభాగంలో రాచకొండ అగ్రస్థానంలో ఉందన్నారు. విజిబుల్ పోలీసింగ్, క్విక్ రెస్పాండింగ్, సాంకేతికత వినియోగంతో ప్రజలతో పోలీసులకు అనుబంధం పెరిగిందని తెలిపారు. ప్రజా భాగస్వామ్యంతో కమిషనరేట్ పరిధిలో సీసీ కెమెరాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఒక్క నెలలోనే మూడు జోన్లలో కలిపి 3,140 కెమెరాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వీటిని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేసి అనుక్షణం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. మూడున్నర నెలల్లో 57 ముఖ్యమైన కేసులను సీసీ కెమెరాల సాయంతో ఛేదించినట్టు పేర్కొన్నారు. మహేశ్వరం, మీర్‌పేట్ మర్డర్ కేసులు, పహాడీషరీఫ్‌లో జర్మనీ యువతి కేసుల్లో వీటి ద్వారానే అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ఒక్క కేసులోనే 17 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పడేలా చూశామన్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్‌కు అనుగుణంగా..

డీసీపీ సునీతా రెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరం జోన్ పరిధిలో రోజురోజుకూ ఎన్నో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, ఫ్యూచర్ సిటీ వైపునకు అడుగులు పడుతున్న నేపథ్యంలో మరో వెయ్యి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. తుక్కుగూడ మున్సిపాలిటీ తరఫున రూ.13 లక్షల వ్యయంతో 75 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించడం అభినందనీయమన్నారు. అనంతరం కమిషనర్ దాతలను సత్కరించారు. కార్యక్రమంలో మహేశ్వరం అదనపు డీసీపీ సత్యనారాయణ, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం ఏసీపీలు పి.లక్ష్మీకాంత రెడ్డి, రాజు, ట్రాఫిక్ ఏసీపీ కుషాల్కర్, ఐటీ సెల్ ఏసీపీ నరేందర్, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీల కమిషనర్లు వెంకట్రామ్, అల్లూరి వాణిరెడ్డి, బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత, తుక్కుగూడ మాజీ చైర్మన్ బరిగెల హేమలత పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, ఆదివారం,
27, ఏప్రిల్, 2025

వేసవి ముదురుతోంది. నగరంలో సగటు ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరువయ్యాయి. చల్లని నీటిని అందించడానికి ఫ్రిడ్జ్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ, సహజమైన చల్లదనం కోసం నగరవాసులు మళ్లీ మట్టి కుండలనే ఆశ్రయిస్తున్నారు. ఆరోగ్యాన్ని అందించే మట్టి ప్రత్యేకతను గుర్తించినవారు ఇప్పుడు నగరంలోని మార్కెట్లతో పాటు ఆన్‌లైన్ వేదికల నుంచి, ఆర్గానిక్ బజార్ల నుంచి కుండలను కొనుగోలు చేస్తున్నారు. వేసవిలో దాహార్తిని తగ్గించుకోవాలంటే కుండలోని నీటితోనే సాధ్యమని పలువురు అభిప్రాయపడుతున్నారు. - సాక్షి, సిటీబ్యూరో



చల్లచల్లగా..

వేడి తాకకుండ..

వేసవి కాలంలో నగరంలో కుండలకు స్టార్ స్టేటస్

రూ.300 నుంచి రూ.3000 వరకూ ధరల్లో విభిన్న రకాలు	అటు కళాత్మకంగా, ఇటు చల్లని ఆరోగ్యాన్ని అందించేలా	ఆన్‌లైన్‌లోనూ అందుబాటులోకి వెరైటీ కుండలు	వాటర్ బాటిల్స్ సహా ఇతర పాత్రలూ అమ్మకం



ఫ్రిడ్జ్ వాటర్ తాగడం వల్ల తాత్కాలికంగా దాహం తీరినట్టు అనిపించినా, ఆ తర్వాత శరీరానికి హానినే కలిగిస్తుందని వైద్యులు గత కొంత కాలంగా హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మట్టి కుండలకు డిమాండ్ పెరిగింది. సహజంగానే మట్టికి చల్లబరిచే గుణం ఉంటుంది. మట్టి కుండలు సహజంగా ఆవిరి ద్వారా నీటిని చల్లబరుస్తాయి. వాటిని వేడి వాతావరణానికి అనువైనవిగా తయారు చేస్తాయి. అలా నీటిని చల్లబరచడం, సహజమైన శీతలీకరణ, మెరుగైన జీవక్రియ, మెరుగైన జీర్ణక్రియతో పాటు రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుంది. వీటితోపాటు మట్టికుండల్లో నీరుటి వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ఇది పర్యావరణానికీ మేలు చేస్తుంది. అంతేకాదు శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలోనూ, వడదెబ్బను నివారించడంలోనూ సహాయపడుతుంది. కడుపులో ఉత్పత్తయ్యే ఆమ్లతను తగ్గించే సామర్థ్యం ఈ నీటికి ఉండటం వల్ల అజీర్ణం, గుండెల్లో మంట వంటి సమస్యలకు నివారణగా పనిచేస్తుంది.

మట్టిలోని పోషకాలతో మేలు..

బంకమట్టిలోని ఖనిజాలు ఎంజైమాటిక్ కార్యకలాపాలకు మద్దతునిస్తాయి. పోషకాల శోషణను మెరుగుపరుస్తాయి. మట్టిలోని ఖనిజాలు నీటి రుచిని కొద్దిమోతాదులో పెంచుతాయి. తద్వారా అధిక పరిమాణంలో నీరు తాగడానికి దోహదం చేస్తుంది. తద్వారా డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండడానికి వీలు కల్పిస్తుంది. ఈ మట్టి నీళ్లలోని ఆల్కలీన్ స్వభావం శరీరంలోని టాక్సిన్లను బయటకు పంపి, రోగనిరోధక వ్యవస్థకు ఊతమిస్తుంది. అలాగే ప్లాస్టిక్ లేదా మెటల్ కంటైనర్లతో పోలిస్తే, మట్టికుండలో నీరు రసాయనాల రహితం. కుండలో నిల్వవున్న నీటికి కాలపరిమితి కూడా ఉండదు. మట్టికుండలు బయోడీగ్రేడబుల్ అంటే పునర్వినియోగానికి వీలైనవి.

చేతికుండలకు కేరాఫ్ ఆదిలాబాద్..

నగరంలో ఆదిలాబాద్ కుండలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆదిలాబాద్ ప్రాంతం మట్టికళలో ప్రత్యేకత సంతరించుకుంది. అక్కడి మట్టి అత్యంత మెత్తగా, మరిన్ని అధిక ఫిల్టర్ గుణాలు కలిగి ఉంటుందని సమాచారం. అంతేకాక ఆదిలాబాద్ కుండలు మిగతా ప్రాంతాల కుండలకంటే గాఢతతో ఉండి, ఎక్కువ రోజుల పాటు నీటిని చల్లగా ఉంచగలుగుతాయి. అలాగే వాటిపై ప్రత్యేకమైన చేతి పనితో ఆకర్షణీయమైన డిజైన్లు కూడా జతచేస్తూ అక్కడి కళాకారులు వాటిని సంపూర్ణంగా సంప్రదాయ పద్ధతిలో తయారు చేస్తున్నారు. వేసవిలో టూర్లు ఎక్కువ వెళ్లే వాళ్లు ఉంటారు కాబట్టి వారి కోసం.. బయట ప్రయాణాలకు అనువైన చిన్న పరిమాణంలో క్లే వాటర్ బాటిల్స్ కూడా అందుబాటులోకి వచ్చాయి.

ఆకట్టుకునే వెరైటీలెన్నో..



ప్రస్తుతం మార్కెట్‌లో గడ్డ కుండలు, జైపూర్ కుండలు, పెయింటెడ్ డిజైన్ కుండలు, ఆదిలాబాద్ మట్టి కుండలు వంటి అనేక రకాలు లభిస్తున్నాయి. చిన్న పరిమాణం గల సాధారణ కుండలు నుంచి పెద్ద డిజైనర్ కుండలు వరకూ ఎన్నో రకాలు వినియోగదారులను ఆకట్టుకునేలా కొలువుదీరాయి. చిన్న చిన్నవి రూ.100 నుంచి ధరల్లో ఉంటే మధ్యస్థాయి మోడళ్లు రూ.250–400 మధ్య ఉన్నాయి. ఇంకా పెద్ద డెకరేటివ్ కుండలు రూ.600 నుంచి రూ.1200 వరకూ ధరకల్లా లభిస్తున్నాయి. ప్రత్యేక హ్యాండీ క్రాఫ్ట్ కుండలు, ప్రత్యేక డిజైన్లతో రూపొందించినవాటి కోసం రూ.1500 ఆపైన కూడా నగరవాసులు వెచ్చిస్తున్నారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లోని లామకాన్, సికింద్రాబాద్‌లోని సాక్రెడ్ స్పేస్, వంటి చోట్ల నిర్వహించే ఆర్గానిక్ సంతల్లో గచ్చిబౌలిలోని పలు ఆర్గానిక్ బజార్లలో కుండలు ప్రత్యేకంగా అందుబాటులోకి వచ్చాయి. ఈ కుండలు పూర్తి స్థాయిలో హ్యాండ్ మేడ్, రసాయన రహిత మట్టి ఉపయోగించి తయారవుతాయని, అందుకే వీటితో ఆరోగ్య ప్రయోజనాలు అధికంగా ఉంటాయని తయారీదారులు చెబుతున్నారు.



ఆన్‌లైన్‌లో.. మట్టి వాసన..

ఏళ్లనాటి మట్టి వాసనకు మళ్లీ మంచి రోజులు వచ్చాయనడానికి నిదర్శనంగా ఆన్‌లైన్‌లో పలు వెబ్‌సైట్లు నిలుస్తున్నాయి. అమెజాన్, ఫ్లిప్ కార్ట్, కాంప్లాంట్ మార్కెట్లు, సహజశ్రీ, ఆర్గానిక్ ఇండియా వంటి ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా నగరవాసులు మట్టి కుండలు కొనుగోలు చేస్తున్నారు.. ఆర్గానిక్ ఉత్పత్తులను విక్రయించే వెబ్‌సైట్లలో లభించే ప్రత్యేకమైన 'ఎకో ఫ్రెండ్లీ వాటర్ పాట్స్'కి మంచి ఆదరణ ఉంది. ఎర్తెన్ ఫైన్ క్రాఫ్ట్స్ విలేజ్ డెకార్, కావేరీ డెల్టా ప్రాంతం నుంచి హ్యాండీ క్రాఫ్ట్ చేసిన మట్టికుండలు, క్లే కుకింగ్‌వేర్ సైతం అందించే జిష్టా, కుకింగ్ పాన్‌లు, కర్రీ పాన్‌లు, వాటర్ డిస్పెన్సర్లు తదితర మట్టి ఉత్పత్తులు అందించే మడ్ కార్ట్ వంటివి ఆన్‌లైన్ విపణిలో మట్టికి కేరాఫ్‌గా నిలుస్తున్నాయి.







మైన్ ఎన్ యువర్స్ ప్రదర్శన

బంజారాహిల్స్ : బంజారాహిల్స్ రోడ్‌నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన మైన్ ఎన్ యువర్స్ వెడ్డింగ్ జ్యువెలరీ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. సినీ నటీమణులు అషురెడ్డి, స్రవంతి ముఖ్య అతిథులుగా హాజరై ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తున్న భిన్న రకాల వస్త్రాభరణాలను ధరించి ప్రదర్శించారు. వీరితో పాటు పలువురు మోడల్స్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. రెండు రోజుల పాటు కొనసాగనున్న ఈ ఎగ్జిబిషన్‌లో వెడ్డింగ్, ఫెస్టివల్‌కు సంబంధించిన డిజైనరీ వస్త్రాభరణాలు, దుస్తులు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు హర్‌ప్రీత్ సింగ్ తెలిపారు.

రేపటి నుంచి ది ఎటర్నల్ చిత్ర ప్రదర్శన





సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు నరేందర్‌రెడ్డి సమర్పిస్తున్న 'ది ఎటర్నల్ మెస్మెరైజర్' చిత్రకళా ప్రదర్శన మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో జరుగనుంది. చిత్రకారుడు నరేందర్‌రెడ్డి గీసిన పలు అందమైన, అపురూప చిత్రాలు ఈ ప్రదర్శనలో కొలువుదీరనున్నాయి. ఈ చిత్రకళా ప్రదర్శనను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం ప్రారంభించనున్నారని నిర్వాహకులు తెలిపారు.. ప్రదర్శన వచ్చే నెల 4వ తేదీ వరకూ సందర్శకులకు, ఔత్సాహికులకు అందుబాటులో ఉండనుందని తెలిపారు.



ఇనార్బిట్‌లో ది గ్రీన్ ఫ్లీ

ఇటు పర్యావరణ ఉత్సవం, అటు జాక్‌నైట్స్ సంగీతోత్సవం

సాక్షి, సిటీబ్యూరో: పర్యావరణ అనుకూల జీవనాన్ని ప్రోత్సహించడంతో పాటు, స్థానిక గ్రీన్ బ్రాండ్‌లకు మద్దతు ఇవ్వడానికి, 'ది గ్రీన్ ఫ్లీ' పేరిట ఒక ఫ్లీ మార్కెట్‌ను సైబరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్ నిర్వహిస్తోంది. ఆదివారంతో ముగిసే ఈ కార్యక్రమం అన్ని వయసుల, వర్గాల పర్యావరణ ప్రేమికులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దామని ఇనార్బిట్ మాల్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ది గ్రీన్ ఫ్లీ లో ప్రత్యేక ఆకర్షణగా సేంద్రీయ దుస్తులు, ఉపకరణాలు, బయోడీగ్రేడబుల్ హోమ్‌వేర్, సహజ సౌందర్య పోషణ ఉత్పత్తుల వరకూ అన్ని రకాలనూ ప్రదర్శిస్తున్నామని అన్నారు. అంతేకాకుండా సందర్శకులు ప్రముఖ రాక్ బ్యాండ్ జాజ్ నైట్స్ సంగీతాన్ని కూడా ఆస్వాదించవచ్చని, అలాగే ప్రముఖ అంతర్జాతీయ జాజ్ కళాకారుని లైవ్ కాన్సర్ట్ ఆకట్టుకుంటుందన్నారు.



హైటెక్స్‌లో ఫుడ్ ఇండియా ఎక్స్‌పో-2025 ప్రారంభం

దేశ విదేశాలకు చెందిన ఆహార సంస్థల ఉత్పత్తుల ప్రదర్శన
మూడు రోజుల పాటు కొనసాగింపు

మాదాపూర్ : ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందిస్తున్నట్టు నిర్వాహకుడు తిలక్‌రాజ్ అరోరా తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఫుడ్ ఇండియా ఎక్స్‌పో–2025ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బాలునాయక్, తిలక్‌రాజ్ అరోరా మాట్లాడుతూ ఆహార పదార్థాల ఉత్పత్తి, ప్రాసెసింగ్, పంపిణీ కార్యకలాపాల పరిశ్రమ భారత్‌లో యేటా వృద్ధి చెందుతోందని తెలిపారు. ఆరోగ్య సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను విరివిగా వాడుతున్నారన్నారు. వాటితో తయారు చేసిన పదార్థాలకు డిమాండ్ ఉన్నట్లు తెలిపారు. దేశ విదేశాలకు చెందిన వందలాది సంస్థలు ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఆహార సంస్థకు చెందిన సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమంలో పలు ఆసక్తికర సెషన్‌లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్టాల్స్‌లో తమ అనుమానాలను సందర్శకులు అడిగితెలుసుకోవచ్చన్నారు. సంస్థ ప్రతినిధులు శివం ఆరోరా, అలోక్‌శర్మ, దామోదర్, దేవోదా పాల్గొన్నారు.





రెస్టారెంట్‌ను ప్రారంభించిన సినీ హీరో నిఖిల్

మగ్ స్టోరీస్‌లో తారల సందడి..

సాక్షి, సిటీ బ్యూరో: గచ్చిబౌలిలోని 'మగ్ స్టోరీస్ కెఫే అండ్ కిచెన్' వేదికగా టాలీవుడ్‌కు చెందిన పలువురు సినీ ప్రముఖులు శనివారం సందడి చేశారు. పలు హిట్ చిత్రాలతో పాటు, టీవీ కార్యక్రమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన అనితా చౌదరి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'మగ్ స్టోరీస్ కెఫే అండ్ కిచెన్'ను ప్రముఖ యువ హీరో నిఖిల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ కల్యాణి మాలిక్, నటుడు ఉత్తేజ్, నటి శ్రీలక్ష్మి, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ దాము, ప్రొడ్యూసర్ స్రవంతి రవికిషోర్, రచయిత బీవీఎస్ఎన్ రవి, నటుడు రఘుబాబు, డైరెక్టర్ నందినీ రెడ్డి వంటి పలువురు సినీ ప్రముఖులు పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా నటి అనితా చౌదరి మాట్లాడుతూ.. ఫుడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా భావించే హైదరాబాద్ నగరంలో అరుదైన రుచులతో రెస్టారెంట్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

ట్రాఫిక్ ట్రైనింగ్ పార్క్ భేష్..

సాక్షి, సిటీబ్యూరో: రహదారి భద్రత, సురక్షిత డ్రైవింగ్ అలవాట్లపై అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ పోలీసుల సహకారంతో హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా నిర్వహిస్తోంది. (హెచ్ఎమ్ఎస్ఐ) ఆధ్వర్యంలో నెలకొల్పిన నగరంలోని ట్రాఫిక్ ట్రైనింగ్ పార్క్ చెప్పుకోదగిన సేవలు అందిస్తోందని పలువురు కొనియాడారు. ఈ పార్క్ ఏర్పాటై పదేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో శనివారం 10వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. నియో గురుకుల్ – ది స్కూల్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో స్నేక్ అండ్ లాడర్ గేమ్, సేఫ్టీ రైడింగ్ థియరీ సెషన్, సైకిల్ యాక్టివిటీ వంటి ఇంటరాక్టివ్ సెషన్లలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అండ్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, ఇన్‌చార్జ్ జి.హరీష్ హాజరయ్యారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ ట్రైనింగ్ పార్క్ ప్రారంభమైనప్పటి నుంచి 2 లక్షలకు మంది పైగా రహదారి భద్రతపై శిక్షణ పొందారని నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు.

